క్లుప్తంగా

పేరంటాలమ్మ ఆలయంలో భారీ అన్నసంతర్పణ



రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా శనివారం భారీ అన్నసంతర్పణను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ప్రారంభించారు. రూరల్ మండల పరిధిలోని 9 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి, బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, గ్రామ పెద్దల సహకారంతో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. అన్న సంతర్పణకు రెండు గ్రామాల పెద్దలు పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. జాతీయ రహదారిని భక్తులు దాటేందుకు వీలుగా సహాయ, సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్ సభ్యులతో జల్ జీవన్ మిషన్ పనులు



విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూప్ మహిళలకు జల్ జీవన్ మిషన్ పనులు నిర్వహించే బాధ్యతలను అప్పగించింది. అందుకు సంబంధించిన జాయింట్ బ్యాంక్ ఖాతాను శనివారం పి.నైనవరం గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో జీరో బ్యాలెన్స్‌తో ప్రారంభించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గంధం చంద్రశేఖర్, సీసీ రామారావుల ఆధ్వర్యంలో మూడు గ్రామ జల సంఘం కమిటీల బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారు. ఒక్కో గ్రామ జల సంఘం కమిటీలో డ్వాక్రా గ్రూప్ మహిళలు 9 మంది, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉంటారని ఏపీఎం తెలిపారు. డ్వాక్రా గ్రూప్‌లతో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ నిధులతో మండలంలో 32 పనుల ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసే పనులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఆ 32 పనులు ఆయా గ్రామాల్లో డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా కమ్యూనిటీ కాంట్రాక్ట్ కమిటీలతో చేపడతారని చెప్పారు.

జయహో భారత్ పోస్టర్ ఆవిష్కరణ



ఉయ్యూరు: యువత దేశభక్తితో ముందుకు సాగాలని ఉయ్యూరు పట్టణ ఎస్ఐ జి.వాసు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించే జయహో భారత్ పోటీల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఎస్ఐ వాసు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ విద్యార్థులు, యువతలో దేశభక్తిని పెంపొందించే విధంగా పోటీలు నిర్వహించాలనే ఆలోచన చేయటం శుభపరిణామమన్నారు. దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శన, జాతీయ నాయకుల వేషధారణలో జరిగే పోటీల్లో యువత, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, ఊర కిషోర్‌కుమార్, దీనవాహి ప్రసాద్, హసన్ పాల్గొన్నారు.

రేపు చలివేంద్రపాలెంలో ప్రత్యేక పూజలు

కంకిపాడు: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా చలివేంద్రపాలెం అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో రామ నామం, హనుమాన్ చాలీసా పారాయణం ఈనెల 22వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గన్నవరంరూరల్: మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, ఆశించి పూత రాలిపోతుందని, నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ శనివారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. ఇమిడా క్లోప్రిడ్ మందు 0.3ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగుల ఉధృతి తెలుసుకోవడానికి తోటల్లో జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తామర పురుగు మొదటి దశలో వేప నూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయటం ద్వారా పురుగును నివారించవచ్చని తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

- 24 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు
- ఆడుదాం ఆంధ్రా పోటీలకు విశేష స్పందన



బుద్ధవరం-2 జట్టుకు బహుమతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



ఉయ్యూరులో బహుమతులు అందజేస్తున్న వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం



మహిళా కబడ్డీ పోటీల్లో గెలుపొందిన నున్న టీమ్



నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పునాదిపాడు జట్టు



గంగూరులో క్రీడాకారులతో తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో వారం రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. గంగూరులో శనివారం పెనమలూరు సచివాలయం – 2, గోసాల సచివాలయం – 1 మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీ ఆసక్తిగా జరిగింది. పెనమలూరు జట్టు 35 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేత జట్లకు ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకర్‌రావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఖోఖో పోటీల్లో పురుషులు పెనమలూరు – 1, మహిళలు వణుకూరు – 2 సచివాలయాల జట్లు, షటిల్ పోటీలో పురుషులు పెనమలూరు – 2, మహిళలు పెనమలూరు – 3 సచివాలయాల జట్లు గెలిచాయి. వాలీబాల్‌లో పురుషులు గోసాల – 1, మహిళలు వణుకూరు – 2 సచివాలయాల జట్లు, కబడ్డీ పెనమలూరు 3, మహిళలు గోసాల – 1 సచివాలయాల జట్లు గెలుపొందాయి.

తాడిగడప మున్సిపాలిటీలో..

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో శనివారం క్రికెట్ ఫైనల్ పోటీ జరిగింది. పోరంకి – 2 సచివాలయంపై యనమలకుదురు సచివాలయం – 2 జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. గెలుపొందిన జట్టును మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి అభినందించారు. పురుషులలో కబడ్డీ కానూరు – 4, షటిల్ యనమలకుదురు – 4, వాలీబాల్ తాడిగడప – 2 సచివాలయాల జట్లు గెలిచాయి.

కానూరులో నియోజకవర్గ స్థాయి పోటీలు..

ఈ నెల 24వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

హోరాహోరీగా పోటీలు..

నున్న(విజయవాడరూరల్): ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో శనివారం జరిగిన మండల స్థాయి కబడ్డీ మహిళా విభాగంలో నున్న గ్రామానికి చెందిన టీమ్ గెలుపొందింది. నున్న – 1, కొత్తూరు తాడేపల్లి గ్రామాల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో నున్న టీమ్‌కు 26 పాయింట్లు రాగా, కొత్తూరు తాడేపల్లి గ్రామ టీమ్‌కు 12 పాయింట్లు రావడంతో నున్న – 1 టీమ్ మండల స్థాయిలో గెలుపొందింది. అదే విధంగా మహిళా విభాగానికి సంబంధించి జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో గొల్లపూడి – 5 టీమ్, నున్న – 1 టీమ్‌ల మధ్య జరిగిన పోటీలో నున్న టీమ్ గెలుపొందింది. క్రికెట్ పురుషుల విభాగంలో జరిగిన పోటీల్లో అంబాపురం, నున్న గ్రామాల మధ్య జరిగిన పోటీల్లో నున్న గ్రామం 36 రన్స్ తేడాతో గెలుపొందిందని పీడీ టి.వి.వర్మ తెలిపారు. నున్న గ్రామానికి చెందిన కబడ్డీ(మహిళా విభాగం), బ్యాడ్మింటన్(మహిళా విభాగం), క్రికెట్ పురుషుల విభాగంలో గెలుపొందడంతో నున్న గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ సభ్యులు కాటూరి శ్రీనివాస్‌లు క్రీడాకారులను అభినందించారు.



ఉంగుటూరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఉయ్యూరు: ఆడుదాం ఆంధ్రా పోటీలతో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం అన్నారు. స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీ పడిన జట్లు మండల స్థాయిలో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయి. క్రీడాకారులకు ఎంపీడీఓ విమాదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం స్పోర్ట్స్ కిట్లు, బహుమతులు అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు సముచిత స్థానం కల్పించారని, మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్నారని వారు తెలిపారు.

ఉత్కంఠ భరితంగా పోటీలు

కంకిపాడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని మంతెన జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగింది. టోర్నమెంట్‌లో పునాదిపాడు జట్టు గెలుపొంది నియోజకవర్గ పోటీలకు ఎంపికైంది. క్రీడాకారులను సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, ఈఓ బి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, ప్రత్యేకంగా అభినందించారు.

రేపు మండల స్థాయి ముగింపు వేడుక

కంకిపాడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ముగింపు కార్యక్రమం ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. శనివారం ఆమె వివరాలు తెలుపుతూ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. క్రీడాకారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉంగుటూరులో ముగిసిన పోటీలు

ఉంగుటూరు: తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారంతో ఘనంగా ముగిశాయి. మండల స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో విజేతలను ఎంపీడీఓ శేషగిరిరావు ప్రకటించారు. క్రికెట్‌లో మానికొండ, వాలీబాల్ నందమూరు, కబడ్డీ ఆత్కూరు, ఖోఖో పోటీల్లో ఉంగుటూరు, షటిల్ ఆత్కూరు టీమ్‌లు విజేతలుగా నిలిచాయన్నారు. ఈ నెల 24న గన్నవరంలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో మండల స్థాయి పోటీల్లో విజేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత క్రీడా ప్రాంగణంలో ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. ఈ విభాగాల్లో రన్నర్స్ జట్లకు రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. మరో ఆరుగురు క్రీడాకారులకు రూ.2,500 చొప్పున బెస్ట్ ప్లేయర్ బహుమతులు అందజేశారు. ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర వహించిన ఎంపీపీ అనగాని రవి, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించామన్నారు. పలువురు దాతల సహకారంతో విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.75 వేలు, ఉత్తమ క్రీడాకారులకు రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి రోజు 500 మంది వరకు క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించామన్నారు. క్రీడాకారులను ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, చేబ్రోలు లక్ష్మీమౌనిక అభినందించారు. ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకాధికారి మహ్మద్ అజీ బేగ్, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీటీసీలు తిరివీధి రవి, గుటాల భాగ్యరాజ్, మండల కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు పాల్గొన్నారు.

కోదండరామాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న పరంధామయ్య

గన్నవరం: మండలంలోని బుద్ధవరం గ్రామంలో ఉన్న కోదండరామాలయం అభివృద్ధికి మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన కోదండరామాలయం అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకువచ్చి భారీ విరాళం అందజేసిన పరంధామయ్యకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పరంధామయ్యను సత్కరించారు. ఉప సర్పంచ్ వేల్పూరి బసవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నక్కా కృష్ణయ్య, నాయకులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, గుర్రం బుజ్జి, నక్కా రంగారావు, కొప్పుల పుల్లయ్య పాల్గొన్నారు.

యార్లగడ్డ తక్షణం క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, పార్టీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దళితుల ఆరాధ్య దైవంగా భావించే మహనీయుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించటంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు తక్షణమే క్షమాపణలు చెప్పాలని బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని డిమాండ్ చేశారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆమె, పలువురు ఎస్సీ నాయకులు శనివారం మీడియాతో మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున దేశంలో ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని దుయ్యబట్టారు. అంబేడ్కర్ విగ్రహం పాదాలు పట్టుకుని యార్లగడ్డ క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గంలో అడుగడుగునా ఆయనను అడ్డుకుంటామని హెచ్చరించారు. పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కొడాలి సత్యప్రభాకర్, ఊసా జయప్రసాద్, బడుగు శేఖర్, పండు నాగార్జున, తలారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

'యార్లగడ్డ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

రామవరప్పాడు: దళితుల అభ్యున్నతిపై గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభపై యార్లగడ్డ సంస్కారహీనంగా మాట్లాడారని శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును స్మరించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. దళితుల అభ్యున్నతికి తీసుకొచ్చిన కార్యక్రమాలను చూసి ఓర్వలేక సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. వెంకట్రావు ఇలాగే మాట్లాడితే నియోజకవర్గ ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇకనైనా నోరు అదుపులో ఉంచుకోవాలని హితవు పలికారు.

జగనన్న కాలనీలో తాగునీటి పథకానికి శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడులోని జగనన్న కాలనీలో రూ.3.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన రక్షిత తాగునీటి పథకానికి శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు, పైపు లైను, 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన కుండీని నిర్మించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తానా ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్‌గా ఠాగూర్

పెనమలూరు: తానా ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్‌గా పెనమలూరు గ్రామానికి చెందిన మల్లినేని ఠాగూర్ ఘన విజయం సాధించారు. అమెరికాలో అతిపెద్ద తెలుగు సంఘంగా పేరున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)కు శనివారం జరిగిన ఎన్నికల్లో టీమ్ నరేన్ కొడాలి నుంచి ఠాగూర్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్‌గా పోటీ చేసిన 13,300 ఓట్లతో విజయం సాధించారు. ఠాగూర్ 2023–2025 ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్‌గా పదవిలో ఉంటారు. కాగా ఠాగూర్ తానా చైతన్య స్రవంతిలో భాగంగా ఇటీవల పెనమలూరులో పేద విద్యార్థులకు రూ.లక్ష ఉపకార వేతనాలు అందజేశారు. పేద రైతులకు స్ప్రేయర్లు, రక్షణ పరికరాలు, మహిళలకు కుట్టుమిషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఠాగూర్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన సందర్భంగా పెనమలూరు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా కులగణన



గంగూరులో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది



మాదలవారిగూడెంలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల పరిధిలో అధికారులు, సిబ్బంది కులగణనను శనివారం ముమ్మరంగా చేపట్టారు. మండల పరిధిలోని పెనమలూరు మండలంలో 11 సచివాలయాలు, తాడిగడప మున్సిపాలిటీలో 19 సచివాలయాలు కలిపి మొత్తం 30 సచివాలయాల్లో కులగణన జరిగింది. ప్రతి సచివాలయం వారీగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో కులగణన చేస్తున్నారు. మండల పరధిలో అన్ని సచివాలయాల్లో కులగణన జరుగుతుంది. ఆయా గ్రామాల్లో ప్రజలు కులగణనకు సహకరించాలని తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు కులగణన జరుగుతుందన్నారు. గంగూరులో డిజిటల్ అసిస్టెంట్ రాజేష్‌బాబు, వలంటీర్లు ఆశాజ్యోతి, సునీత ప్రతీ ఇంటికీ వెళ్లి కులగణన చేపట్టారు. స్థానికులు వారి వివరాలు నమోదు చేయించుకున్నారు.

మాదలవారిగూడెంలో సర్వే

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో కులగణన ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి గృహానికి వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. ఆయా కుటుంబాల వద్ద ఈకేవైసీ నమోదు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ నెల 28 వరకూ సర్వే కొనసాగుతుందని సూరంపల్లి పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు తెలిపారు.

కులగణనకు సహకరించండి

ఉంగుటూరు: కులగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శేషగిరిరావు విజ్ఞప్తి చేశారు. ఇందుపల్లి గ్రామంలో జరుగుతున్న కులగణనను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సదుద్దేశంతో ఈ సర్వే చేపడుతుందని, అందరూ సహకరించాలని సూచించారు. మండలంలో సర్వే వేగవంతంగా జరుగుతుందని, 19,819 కుటుంబాలకు 1,112 కుటుంబాలను సిబ్బంది సర్వే చేశారని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సాయం అందించింది. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌కు చెందిన రోజు వారీ కూలీ వల్లెపు జాన్, అతని భార్య మల్లేశ్వరి, కుమారుడు రాజు రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ముగ్గురి కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న వల్లెపు జాన్ కుటుంబానికి మానవత సంస్థ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేసింది. కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా రోత రాతలకు ఖండన



ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక శాసనసభ్యుని కార్యాలయం వద్ద పలు ఎస్సీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతులను దగ్ధం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం అమరావతిలో వంద అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.404 కోట్లతో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. అయినప్పటికీ ఎల్లో మీడియా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌పై తప్పుడు కథనాలు రాయడం దుర్మార్గమన్నారు. నిడమానూరు సర్పంచి, విజయవాడ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు శీలం రంగారావు, సోషల్ మీడియా కన్వీనర్ విజయ్‌రామ్, నాయుడు, కాంద్రు రాజశేఖర్, సర్నాల శంకర్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



గన్నవరం: స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో శనివారం బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా గన్నవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో బైబిల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తొలుత ఈ ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ ప్రారంభించారు. గత 212 ఏళ్లుగా బైబిల్స్‌ను ముద్రించే పనిలో ఈ సొసైటీ విశేషంగా కృషి చేస్తోందన్నారు. బైబిల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, సంస్థ ప్రతినిధులు ప్రేమ్‌దర్శన్ కొడాలి, జోయల్ సుగుణాకర్, గన్నవరం బ్రాంచ్ కార్యదర్శి కేఎస్.బాబురావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష–2024 ప్రశాంతంగా ముగిసిందని వేలేరులోని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో ప్రవేశపరీక్ష నిర్వహించామన్నారు. ప్రవేశ పరీక్షకు 4,407 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 2,015 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ చెప్పారు.